## క్లుప్తంగా

### అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

**కౌటాల:** గడువు తీరిన మందులు విక్రయిస్తే ఫర్టిలైజర్ షాపుల డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కాగజ్‌నగర్ డివిజన్ సహాయ సంచాలకుడు మనోహర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రిజిస్టర్లు, స్టాక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎరువుల, మందుల అమ్మకాల వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. రైతులకు మందులు, ఎరువులు విక్రయిస్తే రసీదులు అందించాలన్నారు. ఆయన వెంట ఏవో రాజేశ్, డీలర్లు ఉన్నారు.

### ఉద్యోగాలు సాధించిన నలుగురికి సన్మానం



సన్మానిస్తున్న సభ్యులు

**ఆసిఫాబాద్అర్బన్:** పట్టణానికి చెందిన నలుగురు యువకులు ఉద్యోగాలు సాధించిన సందర్భంగా అంజనీపుత్ర ఎస్టేట్స్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మజీద్‌వాడలో గురువారం సన్మానించారు. పట్టణంలోని రామడుగుల సాయి (ఐటీబీపీ), సుల్తాన్ అలీ, ఉమర్ బిన్ రైస్, పిడుగు మణికృష్ణ (సీఐఎస్ఎఫ్)లు ఉన్నారు. సంస్థ మేనేజర్ శ్రీధర్‌తోపాటు మల్లేశ్, సమ్మన్న, శ్రీకాంత్, సాయి విరాట్, ప్రశాంత్, కొడయ్య, రాజేందర్, పుల్లయ్య, శంకర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### మానవత్వం చాటిన ఎస్సై



యాచకుడితో పోలీసులు, యువకులు

**కాగజ్‌నగర్‌టౌన్:** కాగజ్‌నగర్ టౌన్ ఎస్సై చంద్రశేఖర్ గురువారం మానవత్వం చాటారు. పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌక్ వద్ద గుర్తు తెలియని యాచకుడు దీనస్థితిలో ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఎస్సై, కానిస్టేబుల్ ఆనంద్, హోంగార్డ్ సూర్యంలను అక్కడికి పంపించారు. పోలీసులు, స్థానికుల సహకారంతో యాచకుడికి హెయిర్ కటింగ్‌తోపాటు స్నానం చేయించి నూతన దుస్తులు ధరింపజేశారు. పట్టణ ప్రజలు పోలీసులను అభినందించారు.

### షెడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ మల్లికార్జున్

**ఆసిఫాబాద్‌రూరల్:** మండలంలోని పర్సనంబాల గ్రామంలో పీరిలా బంగ్లా షెడ్డు నిర్మాణానికి ఎంపీపీ మల్లికార్జున్ గురువారం భూమిపూజ చేశారు. అనంతరం పశు వైద్యసిబ్బంది మురళీకృష్ణతో కలిసి పశువులకు గాలికుంటు నివారణ టీకా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేశ్, సర్పంచ్ కిష్టయ్య, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

### వైద్యశిబిరం



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

**పెంచికల్‌పేట్:** మండలంలోని మురళీగూడ, జిల్లెడ గ్రామాల్లో పెంచికల్‌పేట్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామాల్లో వారం రోజులుగా జ్వరాలు విజృంభిస్తుండటంతో వైద్యసిబ్బంది వైద్యశిబిరం నిర్వహించి రక్త నమూనాలు సేకరించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. హెచ్ఏ ధర్మరావు, ఎంఎల్‌హెచ్‌పీ మాధురి, సర్పంచ్ ఈశ్వరిబాయి పాల్గొన్నారు.

# అటకెక్కిన ‘యంత్రలక్ష్మి’

- ఐదేళ్లుగా అమలుకు నోచని పథకం
- నిధుల్లేక నిలిపివేసిన ప్రభుత్వం
- సాగులో రైతులకు ఆర్థికభారం



రింగన్‌ఘాట్‌లో పత్తి పంట

**కెరమెరి:** రైతులకు వెన్నుదన్నుగా నిలిచే వ్యవసాయ సబ్సిడీ పథకాలకు ప్రభుత్వం మంగళం పాడింది. ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేసేందుకు ప్రవేశపెట్టిన యంత్రలక్ష్మి పథకం అటకెక్కింది. నిధుల్లేక గత ఐదేళ్లుగా ఈ పథకం నిలిచిపోయింది. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకు రాయితీపై ట్రాక్టర్లు, రొటవేటర్లు, నాగళ్లు, పవర్ స్ప్రే తదితర పరికరాలు అందిస్తోంది. 2018 నుంచి నిధుల కొరత కారణంగా పథకం నిలిపివేసింది. యంత్ర పరికరాలు, సబ్సిడీ విత్తనాలు అందక రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో ఎలాంటి విత్తనాలు, సబ్సిడీపై యంత్రాలు వారికి అందడం లేదు. రెండేళ్లుగా విత్తన పంపిణీలో ప్రభుత్వం కోత పెట్టింది. దీంతో పంటల సాగు చేయడంలో రైతులపై ఆర్థికభారం పడుతోంది. మండలంలో మొత్తం 31 పంచాయతీల్లో 6,731 మంది రైతులు ఉండగా 29 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది 24 వేల ఎకరాల్లో పత్తి వేశారు.

**పెరిగిన ధరలతో నిరాశ!**

అన్నదాతలకు వ్యవసాయం పెనుభారంగా మారింది. అమాంతంగా పెరిగిన ధరలతో నిరాశ చెందుతున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలు వేయాలని రైతులకు సూచించడం తప్ప సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందించడం లేదు. ఏటా పెట్టుబడి సాయం రైతుబంధు ఇస్తున్నా..అది కొసరుగానే ఉపయోగపడుతుంది. దీంతో రైతులు వ్యవసాయంపై నిరాసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సబ్సిడీ పథకాలు, యంత్రాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

**పరికరాలు ఇవ్వాలి**



ప్రభుత్వం ఎకరాకు రూ. 5 వేలు అందిస్తున్నా సబ్సిడీపై యంత్రాలు అందించడం లేదు. గతంలో వివిధ రకాల పరికరాలు అందేవి. ఇప్పుడు లేకపోవడంతో ఇబ్బంది తప్పడం లేదు.

– ధర్మారావు, రైతు, చౌపన్‌గూడ

**ప్రభుత్వ ఆదేశాలు రాలేదు**



వ్యవసాయ పరికరాలు అందించాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. యంత్రలక్ష్మి పథకం కొన్నేళ్ల నుంచి నిలిచిపోయింది. ఏరియాను బట్టి కూలీ ధరలు పెరుగుతున్నాయి. ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

– ఎన్ గోపికాంత్, ఏవో, కెరమెరి

## డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి



మాట్లాడుతున్న చిమూర్ ఎమ్మెల్యే బంటిభావు భాంగ్డియా

**చింతలమానెపల్లి:** డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని మహారాష్ట్రలోని చిమూర్ ఎమ్మెల్యే బంటిబావు భాంగ్డియా అన్నారు. మండల కేంద్రంలో గురువారం బీజేపీ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో ఒకే పార్టీ ఉంటే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. డబుల్ ఇంజన్ సర్కారుకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు, మండల అధ్యక్షుడు తిరుపతిగౌడ్, ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, నాయకులు సత్యనారాయణ, రామయ్య, మల్లయ్య, గణేశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

### కోవ లక్ష్మిని కలిసిన మహారాష్ట్ర మంత్రి



కోవ లక్ష్మితో మహారాష్ట్ర మంత్రి ఆత్రం ధర్మారావు బాబా

**ఆసిఫాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఖరారైన జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మిని జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో మహారాష్ట్ర మంత్రి ఆత్రం ధర్మారావు బాబా గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోవ లక్ష్మి ఆయన్ను శాలువా కప్పి సన్మానించారు.

### పంట వివరాలు నమోదు తప్పనిసరి



రైతుతో మాట్లాడుతున్న ఏఈవో మారుతి

**బెజ్జూర్:** వానాకాలం సాగు చేస్తున్న పంట వివరాలను రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేయించడం తప్పనిసరని ఏఈవో మారుతి అన్నారు. మండలంలోని కుకుడా శివారులో పంటలను గురువారం పరిశీలించారు. పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా మార్కెట్‌లో అమ్ముకోవడం సులభమవుతుందని తెలిపారు. పత్తిలో మోతాదుకు మించి రసాయన ఎరువులను వాడొద్దని సూచించారు.

## కారుణ్య నియామకాల కోసం ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

**రెబ్బెన(ఆసిఫాబాద్):** సింగరేణి సంస్థలో పనిచేస్తూ మృతి చెందిన, మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల వారసులకు గురువారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు ఎంఎంసీ కోసం, ఒకరు ఏకమొత్తంలో చెల్లింపుల కోసం, మరో ఉద్యోగి కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించి ధ్రువపత్రాలను పరిశీలించారు. సింగరేణి ద్వారా అందే బెనిఫిట్స్‌పై అవగాహన కల్పించారు. కైరిగూడ పీవో సత్యనారాయణ, డీజీఎం ఫైనాన్స్ రామారావు, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, డీవైపీఎం తిరుపతి, కైరిగూడ ఇన్‌చార్జి మేనేజర్ రాజేశ్వర్ రావు, వెల్ఫేర్ అధికారి వేణు తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి



జైనూర్‌కు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

**కెరమెరి/జైనూర్:** క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని మహారాష్ట్రలోని గడ్చిరోలి ఎమ్మెల్యే దేవ్‌రావు అన్నారు. కెరమెరి, జైనూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. కేస్లాగూడలోని శిల్పకళా వేదికను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కెరమెరి నుంచి పవర్‌గూడ మీదుగా జైనూర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్, అన్నాభావు సాఠే, కుమురంభీం, కొడప కాశీపటేల్, రాణి దుర్గామాత విగ్రహాలకు పూలమాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బంగారు తెలంగాణ పేరుతో కేసీఆర్ ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆత్మారాం, జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్నక విజయ్, నాయకులు కిరణ్, ఆంజనేయులు, వెంకట్, కోవ విజయ్, వేణు, రాథోడ్ సందీప్, గణేశ్, ప్రేంసింగ్, దౌలత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## నోటిఫికేషన్ రద్దు చేయాలి



కలెక్టరేట్ వద్ద నోటిఫికేషన్ ప్రతులు దహనం చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

**ఆసిఫాబాద్:** రాష్ట్రంలో వివిధ రకాల ఏఎన్ఎంల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా గురువారం నోటిఫికేషన్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ప్రగతి భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కోవిడ్ సమయంలో సెకండ్ ఏఎన్ఎంలను దేవుళ్లతో పోల్చి, ఇప్పుడు చిన్నచూపు చూడడం సరికాదన్నారు. ఆందోళనలో నాయకులు వసంత, సంతోషి, పుణ్యవతి, భాగ్యరజిని, కమల, భూదేవి, ప్రమీల, సునీత, ఏఎన్ఎంలు తిరుమల, మీనా, రాధ, పద్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

## బీసీలకు 70 సీట్లు ప్రకటించాలి

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్
- జిల్లా కేంద్రంలో రాస్తారోకో



మాట్లాడుతున్న నాయకులు

**ఆసిఫాబాద్:** అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బీసీలకు 70 సీట్లు ప్రకటించి, నూతన జాబితా విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని రాష్ట్రీయ రహదారిపై గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ జనాభాలో 10 శాతం ఉన్న అగ్రవర్ణాలకు 60 సీట్లు కేటాయించడం, బీసీలపై కపట ప్రేమ చూపించడం కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ పునరాలోచించి బీసీలకు 70 సీట్లు కేటాయించాలని, లేనిపక్షంలో ఎన్నికల్లో బీసీ సమాజం తగిన గుణపాఠం చెప్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, బీసీ సంఘం నాయకులు అవిడపు ప్రణయ్, వైరాగడే మారుతి, సుప్రజ, బొట్టుపెల్లి ప్రశాంత్, ఆకాశ్, సిరికొండ సాయికృష్ణ పాల్గొన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ

**ఆసిఫాబాద్:** హైదరాబాద్‌లోని బేగంపేటలో శుక్రవారం నిర్వహించే ముదిరాజ్‌ల ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సేర్ల మురళీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ప్లీనరీకి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ సామాజిక వర్గానికి అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌ల జనాభా అధికంగా ఉన్న ఉమ్మడి మహబూబాబాద్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రతీ జిల్లాకు రెండు సీట్లు, మిగిలిన జిల్లాల్లో ఒక్కో సీటు కేటాయించాలన్నారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్లు మంజూరు చేయాలన్నారు. ప్లీనరీకి జిల్లా నుంచి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పనులు చేయకుండానే చెల్లింపు !

- రూ.లక్షల్లో తేడాలు
- కెరమెరి జీపీలోనే రూ.67 లక్షల వ్యత్యాసం?
- రాత్రి వరకు కొనసాగిన ఉపాధి హామీ ప్రజావేదిక



అధికారులను ప్రశ్నిస్తున్న డీఆర్‌డీవో సురేందర్

**కెరమెరి:** ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రజావేదిక రాత్రి వరకు కొనసాగింది. ఇందులో అనేక సమస్యలు అధికారులు దృష్టికి వచ్చాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు విస్తుపోయే అంశాలను తనిఖీ బృందం సభ్యులు బయటపెట్టారు. మండలంలో మొత్తం 31 పంచాయతీలు ఉన్నాయి. జాబ్ కార్డులు 8398 ఉండగా.. యాక్టివ్ జాబ్ కార్డులు 6978 ఉన్నాయి. ఇందులో 16,141 మంది కూలీలు ఉండగా..యాక్టివ్ కూలీలు 12,414 మంది ఉన్నారు. 1-1-2021 నుంచి 31-3-2023 వరకు పనుల చేపట్టగా, అధికారులు తనిఖీ చేపట్టారు. వాటికి సంబంధించిన ప్రజావేదికను డీఆర్‌డీవో సురేందర్ సమక్షంలో నిర్వహించారు. మొత్తం 1618 పనులు చేయగా, వాటికి రూ.17,68,59,946 ఖర్చు చేశారు. అందులో కూలీలకు వేతనాల రూపంలో రూ.15,41,28,065 కాగా, మెటీరియల్‌కు రూ.2,27,31,871లు ఖర్చు చేశారు. ఇద్దరు ఎస్సార్పీలు, 16 మంది డీఆర్పీలు, 34 మంది విలేజ్ సోషల్ ఆడిటర్లు తనిఖీ నిర్వహించారు.

**రూ.కోటి గోల్‌మాల్?**

మండలంలోని మొత్తంలో 31 జీపీల పనులకు గురువారం రాత్రి 9:30 గంటల వరకు 11వ ప్రజావేదిక కొనసాగింది. సగానికి పైగా పంచాయతీల్లో రూ.10 నుంచి రూ.20 లక్షల్లో తేడాలు రాగా, ఒక్క కెరమెరి పంచాయతీలో రూ.4.78 కోట్ల పనులు జరుగగా, సుమారు రూ.67 లక్షల వ్యత్యాసం వచ్చినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. చాలా చోట్ల పనులను చేయకుండానే చెల్లింపులు చేయడం, చేసిన పనుల్లో మేజర్‌మెంట్ హెచ్చు, తగ్గులు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడం, చేసిన మట్టి పనులు వర్షానికి కొట్టుకుపోవడం, కొందరు కూలీలకు తెలియకుండానే డబ్బులు డ్రా కావడం, పనులు చేయని వారి పేర్లు ఇంకా ఉండడం, కొన్ని చోట్ల తక్కువ రోజులు పనులు చేసి ఎక్కువ రోజులకు చేసినట్లు లెక్కలు చేయడం, రికార్డుల్లో ఉన్న వాటికి, క్షేత్రస్థాయిలో ఉన్న పనులకు వ్యత్యాసం వచ్చింది. కాగా, పంచాయతీల్లో రూ లక్షల్లో గోల్‌మాల్ జరిగినట్లు ప్రజావేదికల్లో తేటతెల్లం చేశారు. మొత్తం రూ.కోటి వరకు గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తోంది. అయితే మధ్యలో కల్పించుకున్న పలువురు నాయకులు అధికారులతో వాదనలకు దిగారు. ప్రతి ఏడాది చేసిన పనులకు తనిఖీలు నిర్వహించాల్సి ఉండగా రెండు, మూడేళ్లకు నిర్వహించిన పనుల్లో తేడాలు రావడం సహజమేనని, ఇప్పుడు తప్పులు జరిగినట్లు చూపితే ఎలా అని ప్రశ్నించారు. డీఆర్‌డీవో మాట్లాడుతూ.. తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో కొలతలు తీసుకున్నా తర్వాతే నిర్ధారించి వివరాలు వెల్లడిస్తామన్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రతీ నెల జరిగిన పనులకు గ్రామసభలు నిర్వహించాలన్నారు. పని చేయని వారు పేర్లు తొలగించాలని ఆదేశించారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, ఎంపీటీసీ ఇస్తేకార్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి క్రిష్ణమూర్తి, అంబుడ్స్‌మెన్ సాయిశ్రీ, క్వాలిటీ కంట్రోల్ అధికారి రమేశ్, ఎంపీడీవో మహేందర్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, నగేశ్, ఈసీ ఐక్యనాయక్ పాల్గొన్నారు.

## కారుణ్య నియామకపత్రాలు అందజేత



నియామకపత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

**ఆసిఫాబాద్:** జిల్లాలో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తూ విధి నిర్వహణలో మృతి చెందిన కుటుంబీకులు 14 మందికి కారుణ్య నియామక పత్రాలను జెడ్పీ సీఈవో రత్నమాలతో కలసి జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి గురువారం అందజేశారు. జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు కోవ లక్ష్మి తెలిపారు. విధుల్లో చేరిన ఉద్యోగులు నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు.

## ఈరోజు

**సామూహిక వరలక్ష్మీ వ్రతం**

**ఆసిఫాబాద్:** జిల్లాకేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో శుక్రవారం ఉదయం 9.00 గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానాచార్యుడు గుండేటి కోటేశ్వర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. శ్రావణశుక్రవారం పురస్కరించుకొని నిర్వహించే ఈ కార్యక్రమానికి మహిళలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

**కౌటాల:** మండల కేంద్రంలోని గుట్ట పై గల శ్రీ కంకలమ్మ దేవి-కేతేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య తెలిపారు.

**బీజేపీ కార్యకర్తల సమావేశం**

**కౌటాల:** మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు బీజేపీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు నారులే వాను పటేల్ తెలిపారు. సమావేశానికి మహారాష్ట్రలోని చిమూర్ ఎమ్మెల్యే బంటి భావు బాంగ్డియా హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని సూచించారు.

### ఆలయంలో పూజలు

**కౌటాల:** మండలంలోని ముత్తంపేట్ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామవీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. దుద్దిళ్ల మనోహర అవధాని ఆధ్వర్యంలో శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. శనివారం ఉదయం 11.21 గంటలకు విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని వివరించారు.

### చంద్రయాన్-3 వీక్షించిన విద్యార్థులు



జెడ్పీ పాఠశాలలో వీక్షిస్తున్న విద్యార్థులు

**కౌటాల:** చంద్రయాన్-3 ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియను కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం టీవీలో వీక్షించారు. చంద్రయాన్-3 విజయవంతం కావడంతో చప్పట్లు కొట్టి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మార్త రమేశ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని అంశాలపై అవగాహన ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచి గొప్ప శాస్త్రవేతలుగా ఎదగాలన్నారు. చంద్రయాన్-3 చంద్రుని దక్షిణ ధ్రువంపై సురక్షితంగా ల్యాండ్ అవడంతో దేశం సరికొత్త చరిత్ర సృష్టించిందని తెలిపారు. ఇస్రో శాస్త్రవేతలకు అభినందనలు తెలిపారు.

## సంక్షిప్త వార్తలు

**బీమా చెక్కు అందజేత**

**దహెగాం:** మండలంలోని దేవులగూడ గ్రామానికి చెందిన ధరావత్ సావిత్రి రెండేళ్ల క్రితం మృతి చెందింది. 2018లో రూ.436 చెల్లించి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా తీసుకుంది. మంజూరైన 2 లక్షల చెక్కును ఆమె కుమారుడు ధరావత్ దినేష్‌కు టీజీబీ మేనేజర్ నవీన్‌కుమార్ గురువారం అందజేశారు. ఎఫ్ఎల్ఎం ప్రేంరావు, ఫీల్డ్ అధికారి సూరిబాబు, క్యాషియర్ రవి తదితరులు పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం**

**కాగజ్‌నగర్‌టౌన్:** పట్టణంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.రాజేష్, ప్రధాన కార్యదర్శిగా టి.మహేశ్, కోశాధికారిగా ఉమేష్‌కుమార్ ఆరుగురు కార్యవర్గ సభ్యులతోపాటు మరో 9 మంది పదాధికారులను ఎన్నుకున్నారు.

**డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి**

**కౌటాల/పెంచికల్‌పేట్:** ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం యువకులు పోలీస్‌స్టేషన్లలో దరఖాస్తు చేసుకోవాలని ఎస్సైలు ఎస్.మధుకర్, కొమురయ్య ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసులు-మీ కోసం కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులు చేసుకున్న యువతకు లైసెన్స్‌లు ఇప్పిస్తామని పేర్కొన్నారు. ఆధార్, స్టడీ సర్టిఫికెట్ బోనఫైడ్, మెమో, రెండు పాస్‌ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు పోలీస్ స్టేషన్లలో సంప్రదించాలని కోరారు.